

తండావాసులకు మిషన్ భగీరథ జలాలను అందిస్తున్న సిబ్బంది

# సుక్యతండాకు అధికారుల పరుగు

నమస్తే ఎఫెక్ట్

- 'నమస్తే' కథనంతో కదిలిన యంత్రాంగం
- తండావాసులకు ఆగమేఘాల మీద జలాల సరఫరా
- మైలారం రిజర్వాయర్‌ను పరిశీలించిన బృందం



సుక్యతండాలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీవో ప్రకాశ్

రాయపర్తి, ఫిబ్రవరి 21 : సుక్యతండాకు అధికార యంత్రాంగం కదిలివచ్చింది. సాగు, తాగునీరు లేక తండావాసులు ఆరు నెలలుగా అనుభవిస్తున్న కష్టాలపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'నీళ్ల కోసం తండ్లాట' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి ఆగమేఘాల మీద తండాబాట పట్టింది. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లలో సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశాలు రావడంతో ఎంపీవో కూచన ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్నకూస అనూష, గ్రిడ్ ఏఈ నిశాంక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చల్లా అజిత్‌రెడ్డి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్ మంగళంపల్లి వెంకటేశ్‌లతో కూడిన ప్రత్యేక బృందం కాలినడకన పర్యటించింది. ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ జలాలు రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తండాలో నీళ్లు రాక నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకుకు నీటిని అందించే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు పలువురు అక్రమ పద్ధతుల్లో నల్లా కనెక్షన్లు తీసుకున్నట్లు గుర్తించి వాటిని తీసి వేయించడంతో పాటు మెయిన్ పైపులైన్‌కు ఉన్న లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయించి తండావాసులకు అప్పటికప్పుడు మిషన్ భగీరథ జలాలను అందించారు. ఈ సందర్భంగా తండాలో నీటి సమస్య పరిష్కారమయ్యేలా చొరవ చూపిన 'నమస్తే' దినపత్రికకు సుక్యతండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సాగునీటి అందడం లేదని వచ్చిన కథనంపై కలెక్టర్ సత్య శారద స్పందించి ఆదేశాలివ్వడంతో ఇరిగేషన్ ఈఈ రమేశ్‌బాబు ఆధ్వర్యంలోని అధికారుల బృందం మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించింది. నీటి లభ్యత, అవుట్ ఫ్లో గేట్ల నుంచి దిగువన కాల్వలకు నీటి విడుదల వివరాలను డీఈ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సుక్యతండాకు వెంటనే సాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఇక్కడ ఏఈలు బానోత్ బాలదాసు, నందకిశోర్, మల్సూర్‌నాయక్, ప్రశాంత్ ఉన్నారు.

## తహసీల్ ఆఫీసులో వింత పరిస్థితి

ఇది వరంగల్ జిల్లా వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కోసం ఎనిమిది మంది రైతులు శుక్రవారం స్లాట్ బుక్ చేసుకున్నారు. ఉదయం 10 గంటలకే ఆఫీసుకు చేరుకున్న రైతులు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల కోసం వచ్చినట్లు సిబ్బందికి చెప్పారు. ధరణి సర్వర్ డౌన్ ఉందని, కొద్ది సేపటి తర్వాత రిజిస్ట్రేషన్లు చేస్తామని అన్నారు. వేచి చూసిన రైతులు పదే పదే అడగడంతో తహసీల్దార్ సెలవులో ఉన్నారని మధ్యాహ్నం తర్వాత సిబ్బంది చెప్పారు. అయితే తహసీల్దార్ సెలవులో ఉన్నప్పుడు డిప్యూటీ తహసీల్దార్‌కు రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకోసం జిల్లా కలెక్టర్ ఆ రోజుకు ప్రత్యేకంగా, సాంకేతికంగా అనుమతి ఇస్తారు. ఉన్నతాధికారులు బిజీగా ఉండడంతో శుక్రవారం రోజంతా వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరగలేదు. అక్కడి సిబ్బందిని అడిగితే.. కలెక్టర్ ఆఫీసు నుంచి అనుమతి రాలేదని చెప్పారు. శనివారం బ్యాంకులు, ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. సాయంత్రం ఐదు గంటల వరకు వేచి చూసిన రైతులకు మళ్లీ సోమవారం రావాలని సిబ్బంది చెప్పడంతో నీరసించి వెళ్లిపోయారు. బీఆర్‌ఎస్ హయాంలో నిమిషాల్లో పూర్తయ్యే పని ఇప్పుడు రోజంతా కూర్చున్నా కావడంలేదని రైతులు వాపోయారు.

- వరంగల్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- పోర్టల్ పనిచేయక ధరణి సేవల్లో అంతరాయాలు
- రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల కోసం రైతుల ఎదురుచూపులు
- మరో రోజుకు స్లాట్ మార్చుకుంటున్న అన్నదాతలు
- రైతుల మార్టిగేజ్ లోన్లకు అడ్డంకులు
- మధ్యవర్తిని కలిస్తే పూర్తవుతున్న పనులు.. లేదంటే వాయిదాలు



స్లాట్ బుకింగ్‌లు ఉన్నా రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో ఖాళీగా ఉన్న వర్ధన్నపేట తహసీల్దారు ఆఫీసు

# సర్వర్ డౌన్..

## సారు లీవ్‌లో ఉన్నరు

### పడిపోయిన క్రయ విక్రయాలు



రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో భూముల క్రయ విక్రయాలు ఘోరంగా పడిపోయాయి. వ్యవసాయ భూములదీ ఇదే పరిస్థితి. కుటుంబ సభ్యులు, వారసుల మధ్య పంపకాలు తప్పితే ఇతర రిజిస్ట్రేషన్లు జరగడంలేదు. రైతులు వ్యవసాయ భూముల అభివృద్ధి కోసం బ్యాంకుల్లో మార్టిగేజ్ (తనఖా) లోన్లు తీసుకుంటున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో బ్యాంకుల్లో ఈ ప్రక్రియ ఎక్కువగా జరుగుతున్నది. మార్టిగేజ్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి రైతు, బ్యాంకరు కలిసి తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది పూర్తయితేనే బ్యాంకులు లోను డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తాయి. రైతులు స్లాట్ బుక్ చేసుకుని, బ్యాంకర్లను ఒప్పించి తహసీల్ కార్యాలయానికి తీసుకుపోయిన తర్వాత ఎక్కువసార్లు సర్వర్ డౌన్ ఉంటున్నది. సర్వర్ సరిగానే ఉన్నా మామూళ్ల కోసం ఈ కారణం చెప్పి రిజిస్ట్రేషన్లు చేయడంలేదు. మరోసారి బ్యాంకర్లను తీసుకువెళ్లడం రైతులకు ఇబ్బందిగా మారుతున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మరో రోజు వరకు ఉండడానికి అవస్థలు పడుతున్నారు. ఎలాగైనా వచ్చిన రోజే పని కావాలని తహసీల్ సిబ్బందిని వేడుకుంటున్నారు. మధ్యవర్తులకు ఎంతో కొంత ముట్టజెప్పి పని పూర్తి చేసుకొని వెళ్లిపోతున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదు.

ఈ సమస్య ఒక్క వర్ధన్నపేట తహసీల్ కార్యాలయంలో ఉన్నది కాదు. అంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. సాగు భూముల రిజిస్ట్రేషన్ల కోసం వెళ్లే రైతులకు ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ఇబ్బందిగా మారుతున్నాయి. సర్వర్ డౌన్ అని చెప్పి అధికారులు అన్నదాతలను మరింత ఇబ్బంది పెడుతున్నారు. ఇదే అదనుగా బ్రోకర్లు జోక్యం చేసుకుని రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. మధ్యవర్తులను కలిసిన వారి రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తవుతున్నాయి. కలవని వారిని సర్వర్ డౌన్ అంటూ, సాంకేతిక సమస్యలున్నాయంటూ చెప్పి పంపుతున్నారు. పారదర్శకంగా, సులభంగా, అవినీతి రహితంగా, జవాబుదారీతనం పెంచేలా రెవెన్యూ సేవలందించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ సేవలను 2020 అక్టోబరు 29న అందుబాటులోకి తెచ్చింది. ఏడాదిన్నర క్రితం వరకు ఈ సేవలు మెరుగ్గా ఉండేవి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి పేరును భూమాతగా మార్చుతున్నట్లు ప్రకటించింది. కొన్ని నిబంధనలను మార్చి అమలు చేస్తామని చెప్పింది. కొత్త విధానాలు ఎలా ఉన్నా ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా రైతులకు సేవలందించే విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

## రోడ్డు ప్రమాదంలో

# అన్నదమ్ముల దుర్మరణం

- బుల్లెట్ బండిపై హనుమకొండ నుంచి స్వగ్రామం నాచారానికి వెళ్తుండగా ఘటన
- అన్న స్పాట్‌లోనే.., మార్గమధ్యంలో తమ్ముడు మృతి
- ప్రాణాలతో బయటపడిన మరో స్నేహితుడు



అన్నదమ్ములు రాజ్‌కుమార్, శంకర్ (ఫైల్)

నడికూడ, ఫిబ్రవరి 21 : రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు దుర్మరణం పాలయ్యారు. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చారు. సంతోషంగా బుల్లెట్ బండిపై ఇంటికి వెళ్తున్న అన్నదమ్ములను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. మరో స్నేహితుడు గాయాలతో బయటపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషాద ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని కంఠాత్మకూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. దామెర పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన ఉప్పల చంద్రానికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కొడుకు రాజ్‌కుమార్ (25) ప్రైవేటు జాబ్ చేస్తుండగా, చిన్న కొడుకు శంకర్ (22) ఐటీఐ సెకండియర్ చదువుతున్నారు. ఇద్దరూ హనుమకొండలో వేర్వేరుగా ఉంటున్నారు. కాగా, గురువారం రాత్రి 11 తర్వాత తమ స్నేహితుడు బండారి శివకుమార్‌తో కలిసి బుల్లెట్ బండిపై వారి స్వగ్రామం నాచారానికి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 1.30 గంటల తర్వాత నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం బుల్లెట్ బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉప్పల రాజ్‌కుమార్ బైక్‌పై నుంచి ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పల శంకర్, బండారి శివకుమార్‌ను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో శంకర్ మృతి చెందాడు. ప్రస్తుతం శివకుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తండ్రి చంద్రం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దామెర ఎస్సై తెలిపారు.

# తండాలను గుర్తించిన ఘనత కేసీఆర్‌దే



జనగామలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- సేవాలాల్ జయంతి వేడుకల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా

జనగామ, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : దశాబ్దాల వెనుకబాటుకు గురైన మారుమూల ప్రాంత గిరిజనులను గుర్తించి తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది కేసీఆర్ హయాంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం అన్ని కులాలు, మతాలను సమాన భావంతో చూసి రాజధాని నడిబొడ్డున కుల సంఘాలకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించామన్నారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ అధ్యక్షతన జరిగిన శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జనగామలో బంజారా భవన్‌కు స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. పట్టణంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపనకు తాను దాతగా ఉంటానని ప్రకటించారు. ప్రతి గిరిజన తండాలో కనీస వసతులు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని, బంజారా బిడ్డలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో బంజారా కళాకారుడు ఎస్పీ నాయక్, సోమల దాదా, రాష్ట్ర నాయకుడు అజ్మీరా స్వామి నాయక్, సేవాలాల్ జయంతి స్పెషల్ ఆఫీసర్ రూపారాణి, మాజీ కౌన్సిలర్ వాంకుడోత్ అనితానాయక్, డాక్టర్ బాలాజీనాయక్, శంకర్‌నాయక్, బంజారా నాయకులు కొర్ర కాలురామ్ నాయక్, ధర్మ బిక్షంనాయక్, బానోత్ రవినాయక్, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌నాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌నాయక్, బిక్షపతినాయక్, వెంకటేశ్‌నాయక్, జైరామ్‌నాయక్, వినోద్‌నాయక్, రాజునాయక్, కోటినాయక్, రమేశ్‌నాయక్, ఠాకూర్‌నాయక్, ప్రదీప్‌నాయక్, మహేందర్ నాయక్, జూమ్‌లాల్‌నాయక్, కొర్ర శంకర్‌నాయక్, కిషన్‌నాయక్, హాలియా, విజేందర్ పాల్గొన్నారు.

## నిట్‌లో ఆలిండియా టోర్నమెంట్స్ ప్రారంభం

దేశంలోని నిట్‌ల నుంచి పాల్గొన్న 775 మంది విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21: వరంగల్ నిట్‌లో ఆలిండియా ఇం టర్ టోర్నమెంట్స్ శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నమెంట్స్ శుక్రవారం సాయంత్రం నిట్ స్టేడియం లో ఘనంగా ప్రారంభమయ్యాయి. వాలీబాల్, హ్యాండ్ బాల్, యోగా పోటీలు 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఈ వేడుకను అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు జీఆర్ కిర ణ్ ప్రారంభించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచా ర్య, స్పోర్ట్స్ కార్యకలాపాల హెడ్ ప్రొఫెసర్ రవికుమార్ హాజరయ్యారు. గౌరవఅతిథులుగా ప్రొఫెసర్ అజీమ్ (చీఫ్ వార్డెన్), ప్రొఫెసర్ ఆర్ దయానిధి (భౌతిక విద్యావిభాగం మాజీ అధిపతి, పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్), అలాగే ప్రొఫెసర్ ఆంద్రూ (భౌతిక విద్యా విభాగం నుంచి పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్) పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో జీఆర్ కిరణ్ మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు విజయం కోసం మాత్రమే కాకుండా క్రీడా స్ఫూర్తిని ఆస్వాదించాలన్నారు. క్రీడలు క్రమశిక్షణ, టీమ్ వర్క్, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలోఉపయోగపడుతాయన్నారు. దేశంలోని ఎన్‌ఐటీల నుంచి మొత్తం 775మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలు తెలంగాణ వాలీబాల్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ల పర్యవేక్షణలో, యోగా పోటీలు తెలంగాణ యోగా అసోసియేషన్ పర్యవేక్షణలో జరుగనున్నాయి.





టోర్నమెంట్స్‌లో పాల్గొన్న వరంగల్ నిట్ విద్యార్థులు

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

గణపురం, ఫిబ్రవరి 21: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి భూపాలపల్లి డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు 20 ఏళ్ల శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఎస్సై రేఖ అశోక్ కథనం ప్రకారం.. మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పున్నం రంజిత్ 2022లో అదే గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై అభినవ్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించారు. దీంతో అప్పటి డీఎస్పీ రాములు కేసు దర్యాప్తు చేశారు. కాగా, ప్రస్తుత డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై అశోక్, కోర్టు ఆఫీసర్ శ్వేత సాక్షులను ప్రవేశపెట్టగా లీగల్ సపోర్టర్ కల్వాల అఖిల సహకారంతో స్పెషల్ పీపీ విష్ణువర్ధన్ రావు కేసును కోర్టులో వాదించగా, సెషన్స్ కోర్టు జడ్జి పీ నారాయణ బాబు నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా భూపాలపల్లి డీఎస్పీ ఏ సంపత్ రావు, సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, ఏఎస్సై వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ శ్వేతను ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

## పాకాలకు బ్యాటరీ కారు.. ఇక చేద్దాం షికారు..



పర్యాటకుల కోసం రెండు కాలుష్యరహిత వాహనాలు

పాకాలకు శుక్రవారం రెండు బ్యాటరీ వాహనాలు వచ్చాయి. ఇక్కడికి వచ్చే పర్యాటకుల కోసం అటవీ శాఖ ఇప్పటికే బోటింగ్ పాయింట్, నైట్ క్యాంపెనింగ్, బట్టర్‌ఫ్లై గార్డెన్ ఏర్పాటుచేసింది. అయితే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే టూరిస్టులు కట్టపైకి వాహనాల్లో వెళ్తుండడంతో పరిసరాలు కాలుష్యం అవుతున్నాయి. ఈక్రమంలో బ్యాటరీ వాహనాలను పాకాలకు తీసుకొచ్చారు. ఇక పాకాలకు వచ్చే వారు ఎంట్రెన్స్‌లో టికెట్ కొనుగోలు చేయగానే బ్యాటరీ కారులో కట్టపైకి తీసుకెళ్తామని ఒక్కో వాహనంలో 10మంది కూర్చునే వీలుందని అటవీ అధికారులు తెలిపారు.

- ఖానాపురం, ఫిబ్రవరి 21



# రక్తపుటేరులు!

## నగరంలో నడిరోడ్డు పైనే ఘాతుకాలు

- కలవరపెడుతున్న దారుణ హత్యలు
- వణుకుతున్న ప్రజలు
- నేరం జరిగినపుడే పోలీసుల అలర్ట్

సుబేదారి, ఫిబ్రవరి 21 : వరంగల్ నగరంలో రక్తపుటేరులు పారుతున్నాయి. హత్యలు, హత్యా ప్రయత్నాలు ప్రజలను కలవరపెడుతున్నాయి. రోజురోజుకూ దారుణ ఘటనలు వణికిస్తున్నాయి. దుండగులు పగబట్టి సాటి మనుషులను నడిరోడ్డుపైనే నరికి చంపుతున్నారు. చిన్న చిన్న కారణాలతో క్షణికావేశానికి లోనై కొందరు, భూ తగాదాలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలతో మరికొందరు ప్రత్యర్థులపై దాడికి తెగబడుతున్న ఘటనలు ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, ప్రధానంగా వరంగల్ నగరంలో చోటుచేసుకుంటున్నాయి. అయితే వీటిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. వారు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతోనే దుండగులు రెచ్చిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది నెలల క్రితం నగరంలో ఒకే రోజు మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధి రంగంపేటలో కారులో వృద్ధుడి దారుణ హత్య, కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి బాపూజీ నగర్‌లో వృద్ధుడిపై ఓయువకుడు కత్తితో దాడిచేసిన ఘటనలు కలకలం రేపాయి. గతనెల 22న పట్టపగలు సుబేదారి పోలీసు స్టేషన్ పరిధి అదాలత్ అమరవీరుల జంక్షన్ వద్ద ఓ ఆటో డ్రైవర్ మరో ఆటో డ్రైవర్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. దీనిని మరిచిపోకముందే గురువారం రాత్రి నగరంలోని భట్టుపల్లి ప్రధాన రోడ్డుపై కారులో వస్తున్న వైద్యుడు సుమంత్‌రెడ్డిని ఇనుప రాడ్లతో చితకబాదారు. తీవ్రంగా గాయపడిన అతడి పరిస్థితి విషమంగా ఉంది.

**నేరం జరిగినప్పుడే అలర్ట్..**

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌లో పనిచేస్తున్న పోలీసు అధికారులు వారి ఏరియాలో ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అలర్ట్ అవుతున్నారే తప్ప ముందస్తుగా నేరం జరగకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. పాత నేరస్తులపై నిఘా పెట్టడం, భూ తగాదాలు, కుటుంబ గొడవలు, ఆర్థిక లావాదేవీల్లో ప్రత్యర్థులతో ముప్పుందని తెలిసినప్పటికీ వారిని గట్టిగా హెచ్చరించకపోవడంతో హత్యలు, దాడులకు దారి తీస్తున్నట్లు జరిగిన సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

### ఇటీవల జరిగిన కొన్ని హత్యలు

- ఆరునెలల క్రితం మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధి రంగశాయిపేటలో భార్యాభర్తల గొడవలో అల్లుడిని హత్య చేసిన మామ
- కొద్ది నెలల క్రితం కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి రహమత్‌నగర్‌లో విజయ అనే వృద్ధురాలిని కొట్టి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు
- కొద్ది నెలల క్రితం మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలోని బార్‌షాప్‌లో మద్యం మత్తులో వ్యక్తిని బీర్‌సీసాతో కొట్టి చంపిన వ్యక్తులు
- ఇటీవలె మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధి రంగంపేటలో బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగిని కారులో హత్య చేసిన ఘటన
- గత జనవరి 22న అదాలత్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ దారుణ హత్య

### హత్యాయత్నాలు..

- కొద్ది నెలల క్రితం మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వాహనంపై గడ్డి మోపు తీసుకెళ్తున్న రైతుపై ఉమ్మివేసి తీవ్రంగా కొట్టిన ఓ రౌడీషీటర్
- ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోని సాకరాసికుంటలో బొడ్రాయి పండుగ సందర్భంగా ఇరు వర్గాలు తల్వార్లతో దాడి
- మూడు నెలల క్రితం కాజీపేట పోలీసు స్టేషన్ పరిధిలో పెట్రోల్ బంక్‌లో ఓ వాహనదారుడిపై రౌడీ గ్యాంగ్ దాడి
- మూడు నెలల క్రితం కేయూసీ పోలీసు స్టేషన్ పరిధిలో స్విగ్గి డెలివరీ బాయ్‌పై మాజీ రౌడీ షీటర్ దాడి
- గత డిసెంబర్‌లో కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి బాపూజీనగర్‌లో వృద్ధుడిని విచక్షణారహితంగా కత్తితో పొడిచిన యువకుడు
- ఈ నెల 20 రాత్రి భట్టుపల్లి రోడ్డుపై కారులో వెళ్తున్న వైద్యుడిని తీవ్రంగా కొట్టిన దుండగులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గత ఏడాది జనవరి 1నుంచి డిసెంబర్ 31 వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 40 హత్యలు జరగగా, వీటిలో 20కి పైగా నగరంలోనే చోటుచేసుకున్నాయి. 107 హత్యా యత్నాలు జరగగా, గత సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలలతో పోల్చితే ఈ ఏడాది తొలి రెండు నెలల్లోనే హత్యలు, హత్యాయత్నాలు రెట్టింపయ్యాయి.